# కస్తూరి కన్నడ కథలు

## – చందకచర్ల రమేశ్ బాబు

**జారుడు జీవితం** **కన్నడ మూలం: దీప్తి భద్రావతి**

**తెలుగు అనువాదం: చందకచర్ల రమేశ బాబు**

సహజంగానే నా కళ్ళల్లో ఆమె గురించిన నిరీక్షణ ఉండేది. ఆమెదే కాదు. ఆమెలాంటి అనేకులు నా నిరీక్షణ లిస్ట్ లో ఉన్నా ఆమె అంటే నాకు ప్రత్యేకమైన ఇష్టం. ఎందుకంటే ఆమెది మా ఊరే. అదీ కాకుండా మేమిద్దరం ఒకే స్కూల్లో నాలుగో తరగతి దాకా కలిసి చదువుకున్నాము. నేను ఎం.ఎస్.డబ్ల్యు కోర్సు ముగించి మొట్ట మొదటగా ఆస్పత్రిలో ఆప్త సమాలోచకిగా చేరినప్పుడు వచ్చిన మొదటి క్లైంట్ ఆమే. ప్రతి మూడు నెలలకూ ఆమె తప్పకుండా పరీక్షించుకోవడానికి వచ్చేది. అంతే కాదు. ఆమె లాంటి ఇంకా తన స్నేహితులను తనతోపాటు తీసుకొచ్చి కౌన్సెలింగ్ చేయించేది. ఆమె చేసే “ఆ” వృత్తి గురించి అడగడం నా కార్యవ్యాప్తికి రాకున్నా, ఆమె పైనున్న మమకారంతో “ దీంట్లో ఎందుకు దిగావు?” అని ఒకసారి అడిగాను. దానికామె, “భర్త ఇల్లు విడిచి పారిపోయాక, ఎక్కడ చూసినా మురికి గుంటలే కనిపించసాగి, ఉత్తి పుణ్యానికి బురద ఎందుకు ఒంటికి అంటించుకోవడం, తన ముగ్గురు పిల్లలకోసం ఇదే బురదలో ఉండిపోవడమే మంచిది అనిపించి ఉండిపోయాను” అనింది.

“ బాధగా లేదా?” అన్నాను.

“ కడుపుకు బాధ పరిచయం ఉండదు “ అని మార్మికంగా అనింది.

“ సరే. అయిందేదో అయింది. కానీ జాగ్రత్త. ఏ క్షణాన్నైనా రోగాలు తగులుకోవచ్చు. నీ దగ్గరికి వచ్చే వాళ్ళకివ్వు “ అంటూ ఒక రబ్బరు రూపాన్ని చేతిలో పెట్టాను.

“ డబ్బులిచ్చినవాళ్ళు ఒప్పుకోరు. నాకూ చెప్పడం కష్టం.” అనుభవస్థురాల్లా చెప్పింది.

“ అయినా, తెలియ చెప్పు. రేపు నువ్వు కదా బాధపడేది “ అంటున్నప్పుడు ఆమె పైన జాలి కలిగింది.

" అది తెలియ చెప్పే సమయమే కాదు. నీకెలా చెప్పేది ! అదీ కాక కాంపెటీషన్ చాలా ఉంది. నేను ప్రవచనాలిస్తూ కూర్చుంటే... నా దగ్గరికి ఒక్కరూ రారు. తరువాత నువ్విచ్చే ఈ రబ్బరు ముక్కల్ని నేను ఇంటింటికి తిరిగి అమ్మాల్సి వస్తుందంతే " అంటూ జోరుగా నవ్వేసింది.

" నీ తలకాయ" అంటూ నేను కూడా ఆమెతో పాటు నవ్వేశాను.

★★★★★★★★★★★★★

కానీ ప్రతిసారీ ఆమె పరీక్షకోసం వచ్చినప్పుడు నా ప్రాణం కొట్టుకునేది. నెగటివ్ రిపోర్ట్ రానీ దేవుడా అని ప్రార్థించేదాన్ని. ఆ ప్రార్థన ఆమె వరకే కాకపోయినా, ఆమె పైని మమత కొంచెం ఎక్కువగా ఉండేది అనే మాట మాత్రం నిజం. కానీ నేననుకున్న ఆ క్షణం మూడే సంవత్సరాలలో నా ముందు వచ్చి నిలుచునే నిలుచుంది. ల్యాబ్ నుండి వచ్చిన బ్లడ్ రిపోర్ట్ చూసి కుర్చీలో కూలబడ్డాను. ఆ ఐడి నంబర్ ఆమెదేనా కాదా అని మూడు మూడు సార్లు చెక్ చేసి చూశాను. అంతా సరిగ్గానే ఉంది. ఛ! ఎంత పని జరిగింది ! ఎంత చెప్పినా వినకుండా.... కోపం గొంతు దాకా వచ్చింది. దాంతర్వాత నాకు ఒక కొత్త సందిగ్ధం మొదలైంది. ఎలా చెప్పాలి ? చెప్పడం నాకు కొత్తేమీ కాదు. కానీ తను పాసిటివ్ అని తెలిసిన వెంటనే ప్రతి మనిషీ అనుభవించే ఆ క్షణాలకు నేను నిర్లిప్త సాక్షిగా మిగిలిపోయేదాన్ని.

ఏడ్చేవాళ్ళు, మౌనంగా కన్నీరు కార్చేవాళ్లు, ఏకాంతంలో బాధ పడేవాళ్ళు, బ్రతుకే వద్దనుకుని వెళ్ళిపోయేవాళ్ళు! అన్నిఉదాహరణలూ నా ముందున్నా ఈమె ఎలా దీన్నిస్వీకరిస్తుంది అని ఆలోచించి ఆలోచించి హైరానా పడ్డాను. నా సహనానికి పరీక్ష పెట్టేలా ఒక వారమైనా పత్తా లేకుండా పోయిన ఆమె పైన నాకు ఎక్కడలేని కోపం వచ్చింది. ఆమె ఫోన్ కూడా తను వ్యాప్తి ప్రదేశం నుండి బయట ఉన్నట్టు వినిపించసాగింది.

పది రోజులు గడిచుండాలి. ఆమె వచ్చి ఎదురుగ్గా కూర్చుంది.

" ఎక్కడికి వెళ్ళావు?" కోపం తట్టుకున్నాననుకున్నా తన్నుకుని వచ్చింది.

" పని మీద వెళ్ళాను " నిర్లిప్తంగా బదులిచ్చింది.

" పాడైపో" శపించాను. నా గొంతు వణికింది ఆమె దృష్టికి వచ్చుండాలి.

" లేదు. మా ఆఖరి అబ్బాయికి అదేమిటో గుండెలో కంప్లైంట్ ఉందన్నారు. అందుకే బెంగళూరికి వెళ్ళాను. " అనింది.

ఇప్పుడు మళ్ళీ కూలబడ్డం నా వంతయింది. ఇలాంటి సమయంలో ఎలా చెప్పేది ? ఒకవేళ చెప్పకుంటే ఎవరైనా పై ఆఫీసర్లు వచ్చినప్పుడు నా ఉద్యోగానికి ముప్పు రావచ్చు. ఇప్పటికే ఆలస్యమయింది. ఏమైనా కానీ చెప్పెయ్యడమే మంచిది అనుకుని " చూడు ! నువ్విప్పుడు నీ గుండెను గట్టిగా చేసుకోవాలి " అంటూ చెల్లిపోయిన పదాల పీఠికను ఆమె ముందర పరుస్తూ ఆమె వైపు చూశాను.

ఆమె “ తరువాత ...” అనేటట్టు, ఇంతవరకూ నాకు కనిపించని ఒక తటస్థ భావనతో కూర్చుంది.

“ చూడు. ఈ జబ్బువలన ఎలాంటి ఇబ్బంది ఉండదు. మూమూలుగానే నువ్వు బతకొచ్చు. ఆహారం బాగా తీసుకోవాలి. సిడి 4 కౌంట్ తక్కువయితే మాత్రమే మాత్రలు వేసుకోవాలి. అంతా మన చేతుల్లో ఉంది.” అంటూ కంఠతా పట్టినదంతా చెప్తూ పోయాను.

నా మాటలంతా అయిపోయాక “ ఇదంతా నాకు తెలుసు” అంది.

“ ఎలా?” అనుమానంగా అడిగాను.

“వచ్చినప్పుడంతా వినీ వినీ....” చాలా విసుగు చెందినదానిలా అంది.

“ తరువాత ఏం చెయ్యాలో చెప్పు” అన్నట్టుంది ఆమె ధోరణి. ఆమె మొహంలోని ధైర్యం నాకు కొంత నెమ్మదినిచ్చింది. నా పదవిని కాస్త పక్కకు పెట్టి చనువుగా “ ఇకనైనా మానెయ్యి” అన్నాను.

“ వదిలేసి?” అంటూ ప్రశ్నించింది.

“ ఇంకేదైనా చెయ్యి” జంకుతూనే అన్నాను.

“ ఇప్పుడది అసాధ్యం “ కరాకండిగా చెప్పింది.

“ మరి నీ ఆరోగ్యం...” ఆందోళన పడుతున్నట్లు అడిగాను. మనసులో మాత్రం ఈమె ఇంకా ఎంత మందికి ఈ వైరస్ పాకిస్తుందో అనే భయం ఉంది నాకు.

“ నువ్వే అన్నావు కదా ఏమీ భయం లేదని “ అంటూ చిన్నగా నవ్వింది.

“కానీ....” అంటూ రిపోర్టును ఆమె చేతిలో పెట్టాను. కొంత సేపు మౌనంగా దాన్ని చూసి “ఎవరికీ చెప్పవు కదా” అంటూ నా చేతిని బలంగా పట్టుకుంది. నిట్టూర్పుతో కూడిన ఆమె మాటలు నా మనసును ఒక క్షణంపాటు కదిలించాయి. “ సందేహమా ?” అంటూ ఆమె చేతిని మెల్లగా నిమిరాను.

లేదు అన్నట్టుగా తలాడించి “ తప్పుగా అనుకోవద్దు. ఈ పావలా రిపోర్టును ఇప్పుడు బయటకు తీసుకువెళ్తే నా పిల్లలను పెంచడం కష్టమవుతుంది.” అంటూ దాన్ని చిన్న ముక్కలుగా చించేసి అక్కడే ఉన్న చెత్తబుట్టలో పడవేసింది. ఆమె ఇలా చేస్తుందని ఊహించని నేను కంగుతిన్నాను. “ ఎందుకు అలా చూస్తున్నావు ! ఏదీ నీ డిపార్ట్ మెంట్ వాళ్ళిచ్చే రబ్బర్ ఆయుధాలు ఈ రోజు ఇవ్వవా “ అంటూ నవ్వుతూ కండోమ్ పాకెట్ల కోసం చెయ్యి చాపింది. నేను అటూ ఇటూ ఊగిసలాడ సాగాను.

★★★

(వచ్చే నెల మరొక కస్తూరి కన్నడ కథ)

COMMENTS